# పంజరం నచ్చిన చిలుక

రెండు రోజులుగా తెరిపిలేకుండా కురుస్తున్న వాన ఆ ఉదయమే ఆగింది.ఎండ కాసింది. సాయంత్రం సుల్తాన్ బజార్‌లోని జైన మందిరం ముందు నుంచి పోతున్నాను. అసలే ఇరుకైన ఆ రోడ్డును కూరగాయల బండ్లు ఆక్రమించి స్వైరవిహారం చేస్తున్నాయి.

"బోడకాకరకాయలంటాడేమిటీ ? ఇవి ఆగాకరకాయలుకావూ ?" అని ఆశ్చర్యాన్ని నింపుకున్న స్త్రీ కంఠం వినగానే నేను అటు చూశాను.నా ఉత్కంఠకి కారణం లేకపోలేదు. ఉత్తర విశాఖ ప్రాంతం నుంచి కొత్తగా భాగ్యనగరం వచ్చిన తొలి రోజుల్లో బోడకాకర అన్న మాండలికం నాకూ ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ స్త్రీ పక్కనే నిలుచున్న అజానుబాహుణ్ణి చూసి ఒక్క క్షణం అలా ప్రాన్పడి నిలబడిపోయాను మాట లేకుండా. నా చుట్టూ రెండు చేతులు వేసి " రాజూ !" అన్నాడు ఆప్యాయంగా . ఇక సందేహానికి తావెక్కడ ? భాగ్యనగరంలో ఉంటూ సుమారు ముప్ఫై ఏళ్ళు కావస్తున్నా రాజశేఖరం అన్న సంబోధనకే అలవాటు పడ్డాను. రాజూ అని నన్ను పిలిచేవాళ్లు లేరు. ఆనందంతో ప్రతిస్పందిస్తూ " రామం" అన్నాను. నాటకీయంగా చాలాకాలం తర్వాత నేనూ, రామం అలా కలుసుకున్నాం.

మేమిద్దరం కాలేజిలో పట్టాలు అందుకుని , ఎవరి దారిన వారుగా విడిపోయాక ఇదే కలవడం అతను లా చదివి ప్రాక్టిస్ చేస్తున్నాడని చాలాకాలం కిందట కలిసిన మా క్లాస్‌మేట్ ఒకడు చెప్పాడు. ఏడాది కిందట మా బంధువు కలకత్తా నుంచి వస్తూ ఎక్కడో ఒరిస్సాలో జిల్లా జడ్జిగా రామం ఉన్న వార్తను విన్నట్టు నాకు అందించాడు.

రామం నన్ను అతని భార్యకు పరిచయం చేశాక మేం పుత్లిబౌలి దిశగా నడిచాం. అక్కడ పార్కు చేసిన కారులో పాత బస్తీ మీదుగా పోయి, అతని క్వార్టర్స్ చేరుకున్నాం. పచ్చని చెట్లూ చేమల మధ్య ముచ్చటగా ఉంది చిన్న బంగళా.

ముందు గదిలో నేనూ, అతనూ కూర్చుని పాత జ్ఞాపకాలు నెమరేసుకొంటున్నాం.గదికి ఆనుకొని ఉన్న హాలు లోంచి ఏవో వింత వింత ధ్వనులు వస్తున్నాయి. మారాం చేస్తున్న చిన్నిపాప

గొంతులా వినిపించింది.

ఏదో మరచిన విషయం జ్ఞాపకం వచ్చినట్లు ఉన్న పళంగా లేచి " రాజూ! ఇప్పుడే వస్తా" అంటూ రామం హాల్లోకి వెళ్ళాడో లేదో ఆ సందడీ, కలకలం తగ్గింది. నాలుగు నిమిషాల తర్వాత తిరిగి వచ్చిన రామం "మా పిల్లలిద్దరూ ఉద్యోగాల్లో చేరి ఒరిస్సాలో ఉంటున్నా. నాకొక చంటిపిల్లలా వచ్చి మా ఇంట్లో చేరిందో రామ చిలుక. మేం బయటికి ఎక్కడికి వెళ్ళి వచ్చినా దాన్ని పలకరించందే, బుజ్జగించందే ఊరుకోదు. అలుగుతుంది" అన్నాడు.

అలా మేమిద్దరం కొంత సేపు మాట్లాడుకుంటూ ఉంటే పోర్టికోలో కారు ఆగిన చప్పుడైంది. బాగా చీకటి పడింది. రామం ఆఫీసు ఉద్యోగులెవరో వచ్చారు. నన్ను రామం వారికి పరిచయం చేశాక జరిగిన మాటల సందర్భంలో అర్థమైంది. కటకంలో జిల్లా జడ్జిగా ఉన్న రామం ఇక్కడ నేషనల్ పోలీస్ అకాడమీలో తన సేవలందించడానికని డెప్యుటేషన్ మీద వచ్చాడు. ఇంకోమారు ఎప్పుడైనా వస్తానని చెప్పి నేను ఇంటికి వెళ్ళడానికి లేచాను. ఎంతగా వారించినా వినకుండా నన్ను నా నివాసం దగ్గర కారులో దింపే ఏర్పాటు చేసి తన అభిమానాన్ని ప్రకటించాడు.

అలా ఇంటికి తిరిగి వచ్చిన నన్ను ఒక్క విషయం ఎంతగానో ఆశ్చర్యంలో ముంచేసింది. రామం నా పట్ల చూపిన ఆత్మీయతలోకానీ, ప్రవర్తనలోకానీ ఏ మార్పు లేదు, కానీ, అతని ఇంట్లో ఒక పంజరమూ, ఆ పంజరంలో రామచిలుకా నా ఆశ్చర్యానికి కారణమైనాయి.

నా పినతల్లి ఉంటున్న మన్య ప్రాంతంలో నా చదువు కోసం రెండేళ్ళు గడిపాను. ఆ చిన్న జమీందారీ పట్నంలో ఒక కాలేజి ఉంది. పట్ట పరీక్షకు చదువుకునే రోజుల్లో మొట్టమొదట రామంతో పరిచయం ఏర్పడింది. రామం తల్లీ, నా పిన తల్లి బాగా ఎరిగిన వాళ్ళనీ, మేం ఒకే వీధిలో ఉంటున్నామనీ తెలిసిన తర్వాత ఆ పరిచయం స్నేహంగా చిక్కబడింది.

తీరిక సమయాల్లో నా పినతల్లీ, రామం తల్లీ వరండాలో కూర్చుని ఏదో లోకాభిరామాయణం చెప్పుకుంటూ ఉంటే నేనూ అతనూ గదిలో చదువుకునే వాళ్ళం. చదువు విసుగు పుట్టినప్పుడు నింగీనేలా మధ్యనున్న ఎన్నో విషయాలు చర్చించుకునే వాళ్ళం. మా ఇద్దరినీ ఎరిగిన విద్యార్థులు మాలో ఏ ఒక్కరికి ఎదురైనా" ఇంకో శాస్త్రి ఎక్కడ?" అని ప్రశ్నించేటంతగా ఉండేది మా స్నేహం.

మరి అలాటిస్నేహానికి కొన్ని ఆలంబనలూ, సమధర్మాలూ ఉండాలి కదా. లతా మంగేష్కర్ పాటలూ, థామస్ హార్డీ నవలలూ మా ఇద్దరికీ ఇష్టం. ఇద్దరమూ స్వేచ్ఛాప్రియులమే. వర్షకాలంలో

అంగడిలోకి పుష్కలంగా వచ్చిపడే అగాకరకాయల వేపుడు కూర కూడా మాకు ఎక్కువ ప్రీతి. సాయంత్రం ఆ ఊరి జమీందారుగారి బృందావనంలో నుంచి మహేంద్రతనయ ఒడ్డు చేరుకుని ఇసుక తిన్నెల మీద కూర్చునే వాళ్ళం.స్వేచ్ఛగా ఆకాశవీథిలో సాగే కొంగలబారునీ, పచ్చని చెట్ల మీద వాలి కిలకిలమనే రామ చిలుకల్నీ చూస్తూ కాలం గడిపేవాళ్ళం.

ఒక రోజున రామం పక్కింటివాళ్ళు ఎక్కడనుంచి తెచ్చారో కానీ ఒక రామచిలుకను తెచ్చి పంజరంలో పెట్టారు. పంజరం తలుపు సరిగ్గా వెయ్యని కారణంగా అది రెండో రోజు తప్పించుకుని ఎగిరిపోతే, మేమిద్దరం ఎంతో సంతోషించి పండుగ చేసుకున్నాం.

ఇవాళ అలాటి రామం ఇంట్లో పంజరమేమిటి ? ఆ పంజరంలో చిలుకేమిటి ? అసంగతే అడగాలని అనిపించినా సంకోచించాను. నామనసులో ఆ ప్రశ్న ఒక తీరని సందేహంగా నిలిచిపోయింది, ఒక ఆదివారం సాయంత్రం రానే వచ్చింది. అతని నివాసం ముందున్న చెట్ల కింద గార్డెన్ కుర్చీల్లో కూర్చుని ముచ్చటలాడుకునే వేళ రామమే ఆ శుక మహర్షి ప్రస్తావన తెచ్చి వివరించాడు. శ్రోతనై శ్రద్ధగా వింటున్నాను.

“అవి నేను కటకంలో ఉంటున్న రోజులు. సుమారు రెండెకరాల విస్తీర్ణం ఉన్న పళ్లతోటలో మధ్యగా ఉండేది నా కోసం ప్రభుత్వం ఇచ్చిన బంగళా. దాన్ని ఆనుకొని ఉన్న చెట్ల వలయంలో జామి చెట్లూ మావిడి చెట్లూ ఎక్కువ సంఖ్యలో ఉండేవి. బంగళా ముందు ఎత్తయిన పోర్టికో, బంగళా వెనుక కాసింత దూరంగా వంట గదులు. నా పిల్లలిద్దరూ పెద్దవాళ్ళయి ఉద్యోగాల్లో చేరినా, నా మేనల్లుడొకడు నా దగ్గిరనే ఉండి హైస్కూల్లో చదువుకునేవాడు. వాడి పేరు కేశవ్. వాడితో ఆడుకుందుకి తోటి పిల్లల్ని ఎప్పుడూ తెచ్చుకునేవాడు. ఆ విశాలమైన ఆవరణలో పిల్లల సందడి ఎక్కువగా ఉండేది. ఒక రోజున జామి చెట్టు మీంచి మిట్టూ, మిట్టూ అని వింత శబ్దాలు వినిపిస్తే పిల్లలు అటువేపు చూశారు. అక్కడో రామచిలుక వాలింది. అది వాలిన కొమ్మకు దగ్గరగా వెళ్ళిన పిల్లల్ని చూసి సంకోచిస్తూ కాసింత ఎత్తుగా ఉన్న ఇంకో కొమ్మ మీదికి చిన్నగా ఎగిరింది. మా తోటమాలి సిమాంచలం . సింహాచలాన్ని కొందరు ఒఢ్రులు సిమాంచలం అనే ఉచ్చరిస్తారు. ఆ సిమాంచలమేమో పిల్లల ఉత్సాహాన్ని చూసి, ఆ చిలుకను పట్టుకునే ప్రయత్నం చేశాడు. కానీ, అది చిన్న చిన్న గంతులు వేస్తూ రెమ్మల మాటుకి పోతూ ఉంది. ఈ తతంగం అంతా కిటికీ లోంచి చూస్తున్న నేను చిలుకను పట్టుకోవద్దని మందలించాను. అలా ఆ రోజున చిలుక చెట్లలోకి పోయింది.

‘ఎవరో పెంచుకుని వదిలేసిన చిలుక అయి ఉంటుంది’ అన్నాడు సిమాంచలం. “నీకెలా

తెలుసా" అని తర్కించాడు కేశవ్. "మనుషులకు దగ్గరగా ఉండాలని ఇష్టం కనపరుస్తున్నాది. చిన్న చిన్న మాటలు వచ్చును. పట్టుకోబోతే రివ్వున ఎగిరి పారిపోలేకపోతున్నాది." అని వివరించాడు సిమాంచలం. నేను ఇంతలో కలుగ జేసుకుని చిలుక స్వేచ్ఛగా ఎగరాలని కోరుకుంటుంది కదా అని అడిగాను.

'దీన్ని పెంచినవాళ్ళు రెక్కల్ని కత్తిరించేసి ఉంటారు. చాలాకాలంగా పంజరం పాలైన చిలుకలకు ఎగరాలని ఉన్నా కండరాలకు ఎగిరే శక్తి తగ్గి ఇక అవి ఎగరలేవు." అన్నాడు సిమాంచలం.

ఆ వివరణ తర్కబద్ధంగానే ఉన్నట్టు తోచింది నాకు. అది కొన్ని రోజులు కనపడకుండా పోయేది. మళ్ళా పిల్లలాడుకునే వేళ మిట్టూ అని అరుస్తూ అప్పుడప్పుడు చెట్ల మీద తన ఉనికిని ప్రకటించేది.

ఒక మధ్యాహ్నం నేను కోర్టు నుంచి ఇంటికి వచ్చేసరికి బంగళా వెనుక వంట గది దగ్గర ఏదో వింత చూస్తూ పిల్లలు వలయంగా నిలబడ్డారు.

తోటమాలి సిమాంచలం ఒక జంగిడి (వెదురుతో అల్లిన బుట్ట) లో ఉన్న చిలుకను పరిశీలనగా చూస్తున్నాడు.

'దాన్ని ఎందుకు పట్టుకున్నారు ? వదలి పెట్టం'డని నేను మందలించాను.

కాకులు పొడుస్తూ ఉంటే అదే కిందకి వచ్చేసిందనీ, స్తంభం చాటున దాక్కుందనీ, బుట్టను చూపెడితే అందులోకి వచ్చేసిందనీ మాకు వంట చేసి పెట్టే పాణిగ్రాహి అన్నాడు.

మా కేశవ్‌కి చిలుకంటే ఇష్టం కదా అని సిమాంచలం, పాణిగ్రాహి ఏకమై కట్టుకథ చెబుతున్నారేమో అని నాకు తోచింది. ఆ చిలుకను కొమ్మమీదే వదిలిపెట్టమని వాళ్ళిద్దర్నీ మందలించాను గట్టిగా .

ఆ తర్వాత కొంత సేపటికి నా కళ్ళ ముందు జరిగిన సంఘటన చూసి ఎంతగానో బాధ పడ్డాను. రెండు కాకులు ఎక్కడి నుంచో రివ్వున వచ్చి దాన్ని కసిగా పొడిచాయి. ఆ చిలుక కాస్తా కిందపడి పాకుకుంటూ వెళ్ళి, మళ్ళా ఆ స్తంభం వెనుక సన్నని సందులో ఇరుక్కుంది. వీపు మీద పొడిచిన కారణంగా నేలమీద రక్తం చుక్కలు పడ్డాయి. పాణిగ్రాహి వెదురు బుట్టను తెచ్చి దగ్గరాగా ఉంచాడు.శరణార్థిలా అందులోకి వచ్చి కూర్చుంది ఆ చిలుక. నేనింక వాళ్ళ ప్రయత్నానికి ఏ అంతరాయం కలిగించలేదు.

ఆ నెలలో నాభార్య మా బంధువుల ఇంట పెళ్ళికని వెళ్ళవలసి వచ్చింది. కేశవ్, నా ఇద్దరు పిల్లలూ ఆమె వెంట వెళ్ళారు. నేను వెళ్ళ లేదు. ఇంట్లో పాణిగ్రహి, సిమాంచలం ఉండేవారు. పాణిగ్రాహి పంజరాన్ని శుభ్రం చేసి చిలక్కి నీళ్ళు తాగడానికి ఒక గిన్నె పెట్టి సౌఖ్యంగా ఉండే ఏర్పాటు చేసేవాడు. కాకి పొడిచి పెట్టిన గాయాన్ని దూదితో తుడిచి, ఏవో ఆకుల పసరులు పోసి చికిత్స చేసేవాడు తోటమాలి.

నా కాగితాల్లో, పుస్తకాల్లో తలదూర్చి నేనుంటే ఒంటరితనం వల్లనో ఏమో మిట్టూ, మిట్టూ అని నేను తల ఎత్తి దాని వైపు చూసేదాకా కవ్వించేది. అలా వారం రోజుల పాటు నాతో ఎక్కువగా స్నేహ, పెంచుకుంది. నేను ఏది తిన్నా కాసింత దానికి పెట్టడం ఒక రివాజైపోయింది.

నేతితో కలిపిన అన్నం ముద్ద ఎక్కువ ప్రీతిగా తినేది. ఏ పండు పెట్టినా ఇష్టంగా తినేది. నేనెక్కడికి వెళ్ళినా, ఎక్కడ నుంచి ఇంటికి వచ్చినా దాని దగ్గరగా వెళ్ళి 'మిట్టూ ! మిట్టూ 'అంటూ పలుకరించడం నాకొక అలవాటుగా మారింది.

కానీ, గాలిలో హాయిగా ఎగిరే పక్షి నా కళ్ల ఎదుట పంజరంలో ఉండడం భాధగా ఉండేది నాకు . వారం రోజుల పాటు మా చిలుక మీ ఇంట్లో ఉంది, మాకు ఇవ్వరూ అని ఎవరైనా వచ్చి అడుగుతారేమో అన్న ఆశతో ఎదురు చూసేవాణ్ణి. నిజానికి అదీ ఒక వెర్రితనమే . వాళ్ళు అలా తీసుకుపోతే మిట్టూకి పంజరం బతుకు తప్పిపోతుందా ? అయినా, కంటికి ఎదురుగా ఉండకుంటే దాని జీవితం గురించి ఆలోచించే ప్రసక్తే ఉండదు. అందుకేనేమో అలా ఎదురు చూశాను.

వారం రోజులు గడిచేసరికినేను మౌనంగా ఉండలేక మిట్టూ ! మిట్టూ! అంటూ పంజరంలోకి తొంగి చూసి పలుకరించడం, దాని జాలి చూపులో నా చూపు కలపడం మా మధ్య ఒక వింత ఆత్మీయతకు దారి తీసింది. ఈలోగా చిలుకల జీవితం గురించి తెలియని నేను ఒక చిన్న ప్రయోగం చేసి నాలుక కరుచుకున్నాను."

ఆ విధంగా రామం నా కళ్ళకు కట్టినట్టు శుకచరితం వినిపిస్తూ ఉంటే ఉత్కంఠతో ఆ ప్రయోగమేమై ఉంటుందా అని వింటున్నాను. రామం తన ప్రయోగాన్ని- ఫలితాన్నీ చెప్పడం ఆరంభించాడు.

"మిట్టూకి నేనివ్వగలిగినంత స్వేచ్ఛను అందివ్వాలని నిశ్చయించాను. పంజరంలో నుంచి తీసి బయటనే ఉంచాను. తిరిగి పంజరంలోనికి పోయే ప్రయత్నం చేసింది. అందుకని

పంజరం తలుపు మూసివేశాను. ఆ ప్రయత్నం మానుకుని చిన్న చిన్నగా ఎగిరి ఏ కిటికీ అంచు మీదనో, అల్మారా మీదనో కూర్చునేది. తుర్రున ఎగిరిపోయే ప్రయత్నం నాకు కనపడలేదు. ఇంట్లో కూడా స్వేచ్ఛగా తిరగలేదు. ఆ రాత్రి నేను నా గదిలో పడుకునే ముందు మిట్టూ ఎక్కడుందో అని చూశాను. నాకు దగ్గరగానే నా గదిలోని అలమరా మీద కూర్చుంది.

అర్ధరాత్రి రెక్కలు రెపరెప ధ్వని చేస్తూ కొట్టుకుంటూ ఉంటే లైటు వేసి చూశాను. దాని మీదకు ఉరికే ప్రయత్నం చేస్తున్న పిల్లి నన్ను చూసి పారిపోయింది. ఆ పిల్లిని ఇంటి బయటకు తరిమి కొట్టి మిట్టూను పంజరంలో పెట్టాను. బతుకు జీవుడా అనుకుని ఉంటుంది. నేనింక అటువంటి ప్రయోగమేదీ చెయ్యలేదు.

ఇంతలో నా కుటుంబం పెళ్ళినుంచి తిరిగి వచ్చింది. నా ఆలుబిడ్డలు సందడిగా ఇంట్లో మసలుతూ, మిట్టూను పలుకరిస్తూ, ఆలనా పాలనా చూస్తూ ఉంటే కాస్త భయం తగ్గి మా మధ్య స్తిమితపడింది. అలా క్రమంగా అది మా ఇంటిలో సభ్యత్వం సంపాదించుకుంది.

పంజరంలో జీవించడానికే దాని వోటుహక్కు వినియోగించుకుని నాతీర్పు కోసం ఎదురు చూసింది. ఇలాంటి సున్నితమైన సమస్యకు ఏ తీర్పూ చెప్పలేక, ఏమీ తోచక నా తీర్పును వాయిదా వేస్తూ వచ్చాను. కొత్తవాళ్ళు ఎవరు వచ్చినా మోషయ్ అంటుంది. తరుచూ మిట్టూ అంటుంది. మిట్టూ అన్న మాట దాని పేరుగానే మేమంతా అంగీకరించి సంబోధించడం అలవాటు చేసుకున్నాము.

కొత్త మాటలు నేర్పే ప్రయత్నం చేసినా, అంత ఎక్కువగా నేర్చుకోలేదు. ఇంట్లోని సభ్యులని గుర్తు పడుతుంది. పలుకరించినప్పుడు ఎంతో ఉత్సాహం కనపరుస్తుంది. ఇంట్లో దాన్ని విడిచి అందరం ఎక్కడికైనా వెళ్ళే అవసరం తరుచుగా రాదు. చాలా అరుదుగా వచ్చిన అలాంటి సమయంలో అశాంతి కనపరచేది.

నేనూ నా భార్యా బయటకు వెళ్ళిన సమయాల్లో ఎంతో అసహనం కనపరచి రెక్కలు కొట్టుకునేది. మారాం చేసేది. తిరిగి వచ్చి ఇంట్లో అడుగు పెడుతున్న చప్పుడు వినగానే ఎంతో చైతన్యంతో మా పలకరింపు కోసం ఎదురుచూసేది. మేమంతా తప్పనిసరిగా ఎక్కడికైనా వెళ్ళవలసివస్తే దాని కోసం ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చెయ్యవలసి వచ్చేది.

మిగతా నౌకర్లు డ్యూటీలు మారినా పాణిగ్రాహి, సిమాంచలం దానిని జాగ్రత్తగా చూసి, వేళకు ఆహారం, నీరూ ఇచ్చేవారు.

కటకం నుంచి ఇక్కడికి నేను డెప్యుటేషన్ మీద వచ్చినప్పుడు మిట్టూ కూడా మాతో వచ్చింది. నేను ఎప్పుడైనా నగరం మధ్యకు వెళ్ళి తిరిగి నా క్వార్టర్స్‌కి వస్తూ ఉంటే జూలాజికల్ పార్క్ కనిపిస్తుది. అది చూసిన ఒక రోజున నాకు వింత ఆలోచన వచ్చింది. మిట్టూ

విషయంలో నేను అప్పటికి వాయిదా వేసిన నా తీర్పు గురించే ఆలోచించాను. మొన్ననీ మధ్యనే జూలో పక్షుల రక్షణకు సలహాలిచ్చే అధికారిని సంప్రతించాను. అతను నేను చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. నా క్వార్టర్స్‌కి రెండు మూడుసార్లు వచ్చి మిట్టూని చూశాడు. ఇంకా అతని సలహా నాకు అందించలేదు..... అంటూ మిట్టూ చరిత్రను వినిపించాడు రామం.

ఆ తర్వాత నేను ఎప్పుడు రామం దగ్గరకు వెళ్ళినా మిట్టూ పంజరంలోకి ఒకమారు తప్పనిసరిగా తొంగి చూసేవాణ్ణి.

ఆ ఉత్సాహం నాకు ఇదివరలో ఎన్నడూ కలగలేదు. అకుపచ్చని రెక్కలూ, తోక, కొనతేరి వంగిన ఎర్రటి ముక్కూ ,రెండు లేత ఎరుపు రంగు చక్రాల మధ్య పొదిగిన గాజు గోళాల్లాటి చిన్న కళ్ళూ , వెడల్పయిన కంఠాభరణం వేసుకున్నట్టు ఒక చారతో మిట్టూ నాకు వింతగా కనపడేది. నా కళ్ళలోకి నిర్లిప్తంగా, నీరసంగా చూస్తూ నన్నేమీ చెయ్యవు కదా అని ప్రశ్నించినట్టు నాకనిపించేది.

ఒక రోజు నేను ఒక్కణ్ణే ఆ పంజరం దగ్గరకు వెళ్ళి అలా చూస్తూ ఉన్నాను. ఆరెండు కళ్ళలోని నిర్లిప్తతను పక్కకు తోసి ఎంతో చైతన్యం, ఉత్సాహం కనపరచగానే ఆశ్చర్యంతో వెనక్కు తిరిగి చూశాను. నా వెనుకగా వచ్చి రామం నిలుచున్నాడు. కళ్ళతోనే వాళ్ళు ఇద్దరూ మాట్లాడుకుంటూ ఉంటే నాకు రెప్ప వాల్చకుండా అలానే చూడాలని కోరిక కలిగింది.

నెల తర్వాత కానీ నేను రామం నివాసానికి వెళ్ళడం తటస్థపడలేదు. నే వెళ్ళిన వెంటనే మా మాటల సందర్భంలో మిట్టూ విషయంలో జూలాజికల్ పార్కులోని అధికారి ఏమని సలహా ఇచ్చాడు అని అడిగాను.రామం తాత్త్వికంగా నవ్వాడు. ఒక్కక్షణం ఆగి, తనకందిన సలహాను యథాతథంగా నాకు వినిపించాడు. మిట్టూ మీ ఇంటికి శరణార్థిగా వచ్చిననాటికే పరిమితమైన జీవితకాలంలోని చరమాంకంలో ఉంది. స్వజాతితో జీవించగల ఆసక్తినీ, స్వేచ్ఛను ఆస్వాదించే వయసునూ కొల్పోయింది. ఇప్పుడు మిట్టూకే మాట్లాడగల శక్తి ఉంటే - నేను అందుకోలేని స్వేచ్ఛకన్నా పొందిన ప్రేమే కావాలి - అని అడుగుతుంది అన్నాడట ఆ అధికారి ఎవడో.

మేమిద్దరమూ పంజరానికి కాసేంత దూరంగా నిలబడి మాట్లాడుతూ ఉంటే, మాఇద్దరివేపూ జాలిగా చూస్తోంది మిట్టూ. కాలం వేరు చేసేదాకా మిట్టూనాతోనే ఉంటుంది. అన్నాడు రామం. నా మనసు విచిత్రంగా తేలికపడింది.

- ఇండియా టుడే, సెప్టెంబర్ 6 -20 , 1995